సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలి

పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సూచించారు. - 10లో



కాలువలో జారిపడి బాలుడి మృతి

ఇద్దరు పిల్లలు సరదాగా కాలువలోకి దిగి జారి పడి అందులో ఒకరు మృతి చెందిన సంఘటన రాజుపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
29.9 /21.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 22.2 - 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

పంటల బీమాకు ధీమా కరువు

- ఉచిత పంటల బీమాకు సర్కారు మంగళం
- ప్రీమియం చెల్లిస్తేనే బీమా... అది కూడా రైతులే చెల్లించుకోవాలి
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై రైతులు, రైతు సంఘాలు ఆగ్రహం
- రూపాయి చెల్లించకుండానే గత ప్రభుత్వంలో వేల మందికి లబ్ధి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 3,24,237 మందికి రూ.962.62 కోట్లు చెల్లింపు

పంటల బీమాకు చెల్లించాల్సిన ప్రీమియం

పంట	ఎకరాకు చెల్లించాల్సింది రూపాయల్లో	హెక్టారుకు చెల్లించాల్సింది రూపాయల్లో
వరి	638	1575
శనగ	486	1200
వేరుశనగ	486	1200
జొన్న	319	787.5
పెసలు	273	675
మినుములు	288	712.5
నువ్వులు	182	450
సన్‌ఫ్లవర్	304	750

గత ప్రభుత్వం చెల్లించిన ఉచిత పంటల బీమాలో లబ్ధి ఇలా...

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి రూ. కోట్లలో
2019	1,13,903	361.054
2020	41,122	85.4
2021	90,553	285.71
2022	78,659	203.456



ఇటీవల తుఫాన్ కారణంగా చాపాడు మండలంలో నీట మునిగిన మినుము పంట (ఫైల్)
(ఇన్‌సెట్) తుఫాన్ కారణంగా పాత కడపలో నీట మునిగిన వరిపంట (ఫైల్)

కడప అగ్రికల్చర్ : టీడీపీ ప్రభుత్వానికి రైతులంటే చిన్నచూపే. వ్యవసాయమంటే దండగ అని గతంలో చంద్రబాబు పలుమార్లు వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఉచిత పంటల బీమాకు మంగళం పాడేశారు. దీంతో రైతులు, రైతు సంఘాల నేతలు సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్లపాటు విజయవంతంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమాను అమలు చేసింది. ఆ పథకాన్ని ఎత్తేసి రైతులే పంటల బీమాను చెల్లించుకోవాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది రైతులు నిరక్షరాస్యులే ఉంటారు. వాళ్లు పంటలబీమాను ప్రకటించినప్పుడు తెలుసుకుని వెళ్లి డబ్బులు చెల్లించడం అనేది చాలా కష్టతరమైన పని. ఇలాంటి నేపథ్యంలో పంటల బీమాను రైతులే చెల్లించాలనటం ఎంత వరకు సబబని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విపత్తులో అన్నదాతలకు అండగా...

వర్షాలు, వరదలతో పంటలకు నష్టం వాటిల్లినప్పుడు పరిహారం రూపంలో రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకం దోహదపడుతుంది. బీమా కంపెనీ లెక్కించిన పంట విలువలో రెండు శాతం ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలి. ఫసల్ బీమా యోజన ద్వారా గతంలో 1.5 శాతం రైతు చెల్లిస్తే 0.5 శాతం ప్రీమియాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెల్లించేవి. బ్యాంకుల నుంచి రైతులు పంట రుణాలు తీసుకునే సమయంలో బ్యాంకులే పంటల బీమా చేయించేవి. ప్రీమియం గడువుపై సమాచారం కొరవడటం, పంట రుణాల విడుదలతో జాప్యంతో చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించేవారు కాదు. దీంతోపాటు బ్యాంకు ఖాతా లేని సాధారణ రైతులు కూడా సకాలంలో చెల్లించే వారు కాదు. విపత్తులలో పంట దెబ్బతిన్నప్పుడు బీమా వర్తించక తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చేది.

2019 ఖరీఫ్ నంచి..

రైతుపై ప్రీమియం భారం పడకుండా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 2019 ఖరీఫ్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ క్రాపు నమోదు ప్రామాణికంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. దీనివలన పంటల బీమా గురించి రైతులకు ఇబ్బందులు తప్పేవి. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంలో పంట నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 3,24,237 మంది రైతులకు రూ.962.62 కోట్ల పంట నష్ట పరిహారాన్ని చెల్లించింది.

వైఎస్సార్ జిల్లాకు సంబంధించి..

జిల్లాకు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా రబీ 2024–25కుగాను ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్, వాతావరణ ఆధారిత బీమాకుగాను ఇఫ్‌కో టోకియో వారిని నియమించారు. ప్రీమియం చెల్లింపునకు పంట రుణగ్రహీతలు, రైతులు నేరుగా బ్యాంకు ద్వారా మాత్రమే చెల్లించాలి. రబీలో బ్యాంకు ద్వారా పంట రుణాలను పొందిన రైతులు (సిఎస్‌సి) సీఎస్సీ కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నేరుగా ప్రీమియం చెల్లింపు జరపాలి. నేరుగా ప్రీమియం చెల్లించే రైతులు ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాసుబుక్, పంట ధ్రువీకరణ పత్రం, ఆధార్ అనుసంధానమైన మొబైల్ నెంబర్ వివరాలను జతపరుస్తూ కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలి. లేదంటే రైతులు స్వతహాగా ఎన్‌సిపిఐ ఎన్సీఐపి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ ప్రీమియంను డిసెంబర్ 15 లోపు చెల్లించాలి.

రైతులంటే చిన్న చూపు...



టీడీపీ ప్రభుత్వానికి రైతులన్నా, వ్యవసాయమన్నా చిన్నచూపు. ఇందుకు నిదర్శనం ఉచిత పంటల బీమాను ఎత్తివేయడమే. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన ఈ పథకం వల్ల ఎందరికో రైతులకు మేలు జరిగింది. ఇప్పుడు రైతులే ప్రీమియం చెల్లించమనడం వల్ల చాలా మంది సకాలంలో చెల్లించడం తెలియక ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఆ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి.
– దుగ్గిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రైతు, సుంకేసుల, ఖాజీపేట మండలం

ప్రభుత్వమే భరించాలి..



పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే భరించి రైతులకు కాసింత ఉపశమనం కలిగించాలి. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి పంటల సాగుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో రైతులను ఆదుకోవాల్సింది పోయి భారం మోపడం సరైంది కాదు. – గోసుల వీరారెడ్డి, రైతు, అల్లాడుపల్లె, చాపాడు మండలం

ఉచిత పంటల బీమా అమలు చేయాలి..



ప్రభుత్వం 2024 రబీ సీజన్‌కు పంటల బీమా కొత్త విధానం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అవకాశం కల్పించడం ద్వారా వాటికి లాభదాయకం. దీని వల్ల రైతులకు నష్టం తప్ప మరోకటి లేదు. ప్రభుత్వ ఇన్సూరెన్స్ కంపెనీలను మాత్రమే పంటల బీమాలో భాగస్వాములను చేయాలి. – దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

నేడు పులివెందులకు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక



పులివెందుల రూరల్ : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పులివెందులకు రానున్నారు. ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 11గంటలకు పులివెందులకు చేరుకోనున్నారని పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఇక అక్కడ నుంచి 11.40 గంటలకు ఆయన ఇంటికి చేరుకుంటారని పేర్కొంది. రెండు రోజులు ఆయన జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలలో ఆయన పాల్గొననున్నారు.

2న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం నవంబరు 2వ తేదీ కడప జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల అధికారులంతా తమ ప్రగతి నివేదికలు, సమాచారంతో ఆరోజు ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయంలో జరిగే స్థాయీ సంఘాల సమావేశానికి హాజరు కావాలని కోరారు.

4న ఇంటర్వ్యూలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో కామర్స్, కాంపిట్యూషనల్ డేటా సైన్సెస్ సబ్జెక్టులలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం నవంబర్ 4వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి తెలిపారు. కామర్స్ సబ్జెక్టు గెస్ట్ ఫ్యాకల్టీ కి ఎంకాం అర్హతతో పాటు పీహెచ్‌డీ/నెట్/సెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. కాంపిట్యూషనల్ డేటా సైన్సెస్ సబ్జెక్టునకు ఎమ్మెస్సీ (మ్యాథ్స్), ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ డేటాసైన్స్‌లలో ఏదో ఒక అర్హతతో పాటు పీహెచ్‌డీ/నెట్/ సెట్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు ఒరిజనల్ అర్హత పత్రాలతో నవంబర్ 4వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని ప్రిన్సిపల్ ఛాంబర్ లో హాజరుకావాలని కోరారు.

లయోలా పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు



కళాశాలలో విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న ఎన్‌బీఏ బృందం (ఫైల్)

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు వచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ బ్రిట్టో తెలిపారు. సోమవారం స్థానిక లయోలా పాలిటెక్నిక్ లో ఆయన మాట్లాడుతూ ఎన్‌బీఏ ప్రోగ్రాంలో కళాశాల నుండి ఈసీ, కంప్యూటర్, మెకానికల్ గ్రూపులు పాల్గొన్నాయని.. ఆగస్టు 30, 31, సెప్టెంబర్ 1వ తేదీలలో ఎన్‌బీఏ బృందం కళాశాలను సందర్శించి ఇక్కడి విద్యా ప్రమాణాలను పరిశీలించిందన్నారు. ఇక్కడి విద్యా ప్రమాణాలను చూసి సంతృప్తి చెందిన ఎన్‌బీఏ బృందం ఈసీ, మెకానికల్ గ్రూపులకు ఎన్‌బీఏ వర్తింపజేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆంటోని స్వామి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు, రేపు డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మంగళ, బుధవారాలలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్ర కమిటీ సమావేశాలు కడప యూటీఎఫ్ భవన్‌లో జరుగుతాయన్నారు. సమావేశాల సందర్భంగా కడప ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో విభజన హామీలు, కడప ఉక్కు పరిశ్రమ, కొప్పర్తి పరిశ్రమ కారిడార్ అభివృద్ధి పై సెమినార్ నిర్వహించనున్నామన్నారు. నిరుద్యోగ సమస్యపై చర్చించి , భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగర కన్వీనర్ విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి కోసం అవిశ్రాంత పోరు

- ముగిసిన సీపీఎం మహాసభలు
- ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు

రాయచోటి అర్బన్ : అసమానతలు లేని జిల్లా అభివృద్ధి కోసం సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కేజీఎస్ ఫంక్షన్‌హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలు సోమవారం ముగిశాయి. ప్రజా సమస్యలపై 30 రకాల తీర్మాణాలు చేశారు. కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తదితరాలకు వ్యతిరేకంగా నవంబరు 1నుంచి 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాహోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహింప తలపెట్టామన్నారు. 8న మండల కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు చేయాలంటూ పిలుపునిచ్చామన్నారు. నెల రోజులుగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులు ప్రజలకు సరసమైన ధరలకు అందివ్వాలని కోరారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీ నిర్వహణను పీపీపీ పేరుతో ప్రైవేటు పరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నా యన్నారు. విశాఖ ఉక్కుపరిశ్రమ పరిరక్షణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు వైఖరిని వీడాలన్నారు. తక్షణం కార్మిక సంఘాల నేతలతో చర్చించి కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎంపిక

ఈ సందర్భంగా ఏడుగురు సభ్యులతో కూడిన సీపీఎం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ కార్యదర్శిగా పోతగాళ్ళ శ్రీనివాసులు ఎన్నికయ్యారు. సభ్యులుగా రాజమ్మ, ఎ.రామాంజులు, సి.హెచ్.చంద్రశేఖర్, రవికుమార్, వి.వెంకటయ్య, పందికాళ్ళ మణిలను ఎన్నికంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలతోపాటు జిల్లా నలుమూలల నుంచి ఎన్నికైన ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్నాలో పెరిగిన వరద ఉధృతి



పెన్నానదిలో ప్రవహిస్తున్న వరద నీరు

జమ్మలమడుగు : పెన్నానదిలో మరోమారు వరద ఉధృతి పెరిగింది. గత నాలుగు రోజుల క్రితం పెన్నానదిలోకి 11వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తర్వాత నీటి విడుదల ఏడువేల నుంచి క్రమంగా ఐదువేల క్యూసెక్కులకు తగ్గించారు. సోమవారం తిరిగి మైలవరం జలాశయం నుంచి 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఈఈ యు.రమేష్ పేర్కొన్నారు. ప్రస్తుతం గండికోట జలాశయం నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో ఆ నీటిని నేరుగా మైలవరం జలాశయం ఐదు గేట్లను ఎత్తి పెన్నానదిలోనికి విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం పెన్నానదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

అన్నమాచార్య వ్యవసాయ కళాశాల ఏర్పాటు

- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- ఏయూ అధినేత చొప్పా గంగిరెడ్డి



రాజంపేటలో వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తున్న ఏయూ అధినేత చొప్పాగంగిరెడ్డి

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో అన్నమాచార్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రైవేటు వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశారు. సోమవారం అన్నమాచార్య 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వెనుక భాగం(తాళ్లపాకరోడ్డు)లో నూతనంగా నిర్మించిన భవనాలలో వ్యవసాయ కళాశాలను ఏయూ అధినేత చొప్పాగంగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ రాజంపేట, రైల్వేకోడూరు పరిసర ప్రాంతాలు వ్యవసాయం, ఉద్యానవనానికి ప్రసిద్ధి అని తెలిపారు. అందువల్ల అన్నమయ్య జిల్లాలో ప్రథమంగా వ్యవసాయ కళాశాలను అందుబాటులో తీసుకొచ్చామన్నారు. అన్నమాచార్య యూనవర్సిటీ ద్వారా ఇప్పటికే నేటి సమాజానికి అవసరమయ్యే విద్యా కోర్సులను తీసుకువచ్చామన్నారు. దేశానికి రైతే వెన్నుముక అని, అటువంటప్పుడు వ్యవసాయం పడిపోకుండా అన్నమాచార్య యూనివర్సిటీ ద్వారా ఏర్పాటైన వ్యవసాయ విద్య ద్వారా.. ఎప్పటికపుడు నూతన పరిశోధనలు, పరిజ్ఞానం పెంపొందించుకుని మన దేశాన్ని అన్నపూర్ణ దేశమని నిరూపించేలా వ్యవసాయ విద్యార్థులు రాణించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్‌లు ద్వారకానాథరెడ్డి, డాక్టర్ నారాయణ, డాక్టర్ జయరామిరెడ్డి, ఏయూ రిజిస్ట్రార్ మల్లికార్జున, సుబ్బారావు, డాక్టర్ స్వర్ణలత, అన్నమాచార్య యూనవర్సిటీ అధ్యాపకులు, వ్యవసాయ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 18న నిరసన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

కడప రూరల్ : ఎస్సీ వర్గాల పట్ల రెవెన్యూ శాఖ అధికారులు అనురిస్తున్న తీరుకు నిరసనగా నవంబర్ 18వ తేదీన మాల మహానాడు (రామాజీ వర్గం) ఆధ్వర్యంలో కడపలో భారీ నిరసన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షులు రామాజీ ఇమ్మానియేల్ తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నిరసనకు సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గాలకు చెందిన భూముల పట్ల రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు నిరసనగా కడపలో తల పెట్టిన నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపాక వినోద్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్



సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని అర్జీదారులు ఎంతో ఆశతో వస్తారని, అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి కలెక్టర్‌తోపాటు డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మిలు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్నింటి వివరాలిలా ఉన్నాయి.

- బద్వేలు మండలం చెన్నాయపల్లికి చెందిన కొండమ్మ తమ ఇల్లు ఎన్‌హెచ్ రోడ్డు విస్తరణలో కోల్పోయామని నష్టపరిహారం అందించాలని కోరారు.
- ఎర్రగుంట్ల మండలం హనుమాన్ గుత్తికి చెందిన తనకు 2022 సంవత్సరం నుండి పక్షపాతం వచ్చిందని.. అప్పటి నుంచి ఇబ్బంది పడుతున్నానని ప్రభుత్వం నుండి పింఛన్ ఇప్పించాలని విన్నవించారు.
- అట్లూరు మండలం వేములూరు కు చెందిన జి. యరికాలయ్య తన ఆధీనంలో ఉన్న భూమికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం వరదలలో పోయాయని, పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు.

పేదలందరికీ ఏడాదికి మూడు సిలిండర్లు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెల్లరేషన్ కార్డు కలిగిన పేదలందరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో క్రియాశీల (యాక్టివ్) ఎల్పీజీ కనెక్షన్, ఆధార్ నంబర్, బియ్యపు కార్డు, ఇతర డిపార్టుమెంట్ డేటాబేస్‌తో ధ్రువీకరణ కలిగి ఉండాలని తెలిపారు. ఈ నాలుగు అర్హతలు కలిగి బ్యాంక్ అకౌంటుకు ఆధార్ అనుసంధానమై ఉన్న వారు దీపం 2 స్కీమ్ కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్ పొందేందుకు అర్హులని తెలిపారు. అర్హులు ఏడాదికి మూడు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ దీపం- 2 స్కీంలో మొదటి సిలిండర్ ఈ నెల 31 తేదీ నుండి మార్చి 2025 వరకు అంటే 5 నెలల లోపు, రెండవ సిలిండర్ వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి జులై 31 లోపు , మూడవ సిలిండర్ వచ్చే ఏడాది ఆగస్టు ఒకటి నుండి నవంబర్ 31 లోపు ఉచితంగా పొందవచ్చునని చెప్పారు. ఈ స్కీమ్ ఈ నెల 31వ తేదీన ప్రవేశపెడుతున్నారన్నారు. మొదటి సిలిండర్ బుకింగ్ చేసిన 24-48 గంటల లోపల సరఫరా చేస్తారని తెలిపారు. లబ్ధిదారుడు ముందుగా సొమ్ము చెల్లించి సిలిండర్ పొందాలని తరువాత డెలివరీ అయిన 48 గంటల లోపు వారి బ్యాంక్ ఖాతాలోనికి చెల్లించిన నగదు జమ అవుతుందన్నారు. ఈ స్కీమ్ లో ఉచిత సిలిండర్ పొందాలనుకున్న లబ్ధిదారుడు అక్టోబర్ 29వ తేదీ నుండి మార్చి 2025 వరకు మొదటి సిలిండర్‌కు బుకింగ్ చేసుకోవాలన్నారు. ఫిర్యాదులు, సలహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం


నాగస్వరూప

అట్లూరు : అట్లూరు మండలం తంబళ్లగొంది ఎస్సీ కాలనీకి చెందిన మద్దూరు సుబ్బరాయుడు తన కుమార్తె నాగస్వరూప (22) కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



అట్లూరు : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. అట్లూరు క్రాస్‌రోడ్డు అటవీ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సిద్దవటం వైపు నుంచి బద్వేలుకు ఇసుక లోడ్‌తో వెళుతున్న టీజీ 33 టీ 0480 నంబరు గల టిప్పర్ వాహనాన్ని ఆపామన్నారు. ఇసుకకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఆర్టీపీపీ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 98 ప్రకారం 50 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ సోమవారం ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఉద్యోగాల కల్పన విషయంలో జెన్‌కో యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. 2011 తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఉద్యోగాలు భర్తీ చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నేటి నుంచి అండర్-14 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ క్రీడామైదానం, కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం మైదానాలు వేదికగా ఈనెల 29 నుంచి నవంబర్ 11 వరకు ఏసీఏ అండర్-14 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. గ్రూప్-బీలో భాగంగా విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణ, గుంటూరు, అనంతపురం, నెల్లూరు జట్లు తలపడనున్నాయి. పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఏవైడీ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు.

నర్సరీ యజమాని ఆత్మహత్య

ముదిగుబ్బ: మండల కేంద్రంలో నివాసముంటున్న నర్సరీ యజమాని నరసింహుడు(35) ఆత్మహత్య చేసుకున్నాడు. వైఎస్సార్ జిల్లా వేంపల్లి గ్రామానికి చెందిన ఆయన పదేళ్ల క్రితం ముదిగుబ్బకు వలస వచ్చి నర్సరీ ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆశించిన వ్యాపారం సాగకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పులు తీర్చే మార్గం కానరాక సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలి


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు


రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది

- జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు
- పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా ఉచిత మెగా మెడికల్ క్యాంపు
- రక్తదాన చేసిన పోలీసు సిబ్బంది

కడప అర్బన్ : పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సోమవారం కడప నగరంలోని ఉమేష్ చంద్ర స్మారక పోలీసు కల్యాణమండపంలో పోలీసు, హోంగార్డ్స్, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును సందర్శించి పరిశీలించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అరుణాచలం, శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ స్పెషలిస్టులు డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి (కార్డియాలజీ), డాక్టర్ జయ ప్రకాష్ (పల్మనాలజీ), డాక్టర్ షేక్ నవీద్ అహ్మద్ (కార్డియాలజీ), డాక్టర్ కరీముల్లా (యూరాలజీ), డాక్టర్ సాహైల్ మాలిక్(నెఫ్రాలజీ), డాక్టర్ మమతేశ్వరి జంగా (గైనకాలజీ), డాక్టర్ క్రాంతికుమార్ (న్యూరోసర్జన్), రిమ్స్ వైద్యులు డాక్టర్ కృష్ణచైతన్య (ఆర్థోపెడిక్స్), డాక్టర్ భాగ్యలక్ష్మి (డెంటిస్ట్), డాక్టర్ శివానాయక్ (ఫిజియోథెరపిస్ట్) వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధులు చాలా కష్టంతో కూడుకున్నవన్నారు. వారి డ్యూటీ సమయాలు కూడా చాలా భిన్నంగా ఉంటాయని, ఆహారం కూడా సమయానికి తీసుకోలేని పరిస్థితులు ఉంటాయన్నారు. విధి నిర్వహణలో వారి ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించి, ఆరోగ్యపరమైన సమస్యలను ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని పేర్కొన్నారు. అందరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఒత్తిడిని అధిగమించడానికి యోగా, ధ్యానం చేయాలని సూచించారు.

స్ఫూర్తి ప్రదాతలు.. రక్తదాతలు

జిల్లా పోలీసు సిబ్బంది ప్రజా పరిరక్షణ బాధ్యతతో పాటు రక్తదానం చేసి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచారని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేసిన సిబ్బందిని అభినందించారు. ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందించిన వైద్యులకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమాలలో అదనపు ఎస్పీ (ఏఆర్) బి. రమణయ్య, ఏ.ఆర్. డీఎస్పీ మురళీధర్, పోలీసు సంక్షేమ వైద్యశాల యూనిట్ వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాత, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్‌ఐలు టైటస్, ఆనంద్, వీరేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు యు. వెంకటకుమార్, బి. హేమకుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ డి. భాస్కర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ బి. రామకృష్ణ, చిన్నచౌక్ సీఐ తేజోమూర్తి, రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ సంధ్య, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, స్టేట్ కో ఆప్షన్ మెంబర్ మాధవీలత, పోలీసు వెల్ఫేర్ ఆసుపత్రి సిబ్బంది ప్రసాద్, రమణారెడ్డి, పోలీసులు, వారి కుటుంబ సభ్యులు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో జారిపడి బాలుడి మృతి


ఆదిల్ మృతదేహం


బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటరమణ

రాజుపాళెం : అభం శుభం తెలియని ఇద్దరు పిల్లలు సరదాగా కాలువలోకి దిగి జారి పడి అందులో ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజుపాళెం గ్రామానికి చెందిన బంగ్లా మహబూబ్ పీరాకు ఆదిల్(11) అనే కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉదయాన్నే ఆదిల్, ఫక్రుద్దీన్ కుమారుడు అజీజ్ ఇద్దరు ప్రమాదవశాత్తు కాలువలో జారి పడ్డారు. ఆ దారిలో వెళుతున్న ఓ వ్యక్తి నీటిలో కొట్టుకుపోతున్న అజీజ్‌ను బయటకు తీశాడు. అయితే ఆ సమయంలో ఆదిల్ నీటిలో కనిపించకుండా పోయాడు. ఈ విషయాన్ని ఆదిల్ తండ్రికి, బంధువులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రాజుపాళెం ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తమ సిబ్బందితో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం ప్రొద్దుటూరు ఫైర్ స్టేషన్ సీఐ రఘునాథ్, ఏఎస్‌ఐ ఖాసీం వలీ తమ సిబ్బందితో రాజుపాళెంలోని సైఫాన్ వద్ద వెతికారు. కాలువలో లోపల కొమ్మకు ఆదిల్ మృతదేహం తగులుకుని కనిపించింది. వెంటనే మృతదేహాన్ని బయటకు తీశారు. బాలుడి మృతదేహాన్ని చూడగానే తండ్రితో పాటు బంధువులు, స్నేహితులు బోరున విలపించారు. వారిది ఇదే గ్రామమైనా వృత్తిరీత్యా ఎర్రగుంట్ల మండలం చిలంకూరులో నివాసం ఉంటున్నారు. మహబూబ్ పీరా అన్న కుమారుడి వివాహం మంగళ, బుధవారాల్లో జరగనుండటంతో వారు ఈ గ్రామానికి వచ్చారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు రాజుపాళెం ఎస్‌ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. సంఘటన స్థలాన్ని ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి పరిశీలించారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

వేంపల్లె: వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎస్.శ్రీనివాసులరెడ్డి(47) అనే రైతు అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాసులరెడ్డికి 10 ఎకరాల పొలం ఉంది. తనకున్న పొలంలో పత్తి, వేరుశనగ పంటలను సాగు చేసుకునే వాడు. పంటలు సాగు చేసేందుకు దాదాపు రూ.20 లక్షల వరకు అప్పులు చేసినట్లు బంధువులు తెలిపారు. పంటల పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చలేక ఆదివారం రాత్రి రామిరెడ్డిపల్లెలోని తన పొలంలో పంటల కోసం తెచ్చిన పురుగుల మందు తాగాడు. రాత్రి 9 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో పొలంలోకి వెళ్లి చూడగా శ్రీనివాసులరెడ్డి అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య శశికళతోపాటు కుమారుడు వరుణ్ సందేశ్ రెడ్డి, కుమార్తె వర్షిత ఉన్నారు. మృతుడి భార్య శశికళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగారావు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

పోరుమామిళ్ల : దమ్మన్నపల్లెకు చెందిన గద్దె బాలచంద్రుడు ఆదివారం అక్రమంగా మద్యం తీసుకెళుతుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. అలాగే పట్టణంలోని వరికుంట్ల బస్టాండు వద్ద వెంకటాపురానికి చెందిన దాసరి కొండయ్యను అరెస్టు చేసి అతని వద్ద నుంచి కూడా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి ఇరువురిని సోమవారం కోర్టులో హాజరుపరిచామన్నారు.

శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వెంకటసుబ్బయ్య, బి.లక్ష్మీదేవి కోరారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లాలోని శానిటేషన్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బందికి వీక్లీ ఆఫ్ కూడా లేదన్నారు. జీఓ నంబర్ 108 ప్రకారం వేతనాలు ఇవ్వాల్సి ఉండగా వారికి రూ. 8000 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు రవి ప్రకాశ్, పి.పవన్, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ ఏజెంట్ల ధర్నా

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని స్థానిక హెడ్ పోస్టాఫీస్ బ్రాంచ్ ఆవరణంలో సోమవారం ఉదయం పోస్టల్ ఏజెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు పోస్టల్ మేనేజ్‌మెంట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాలసీదారులకు జీఎస్టీని తగ్గించాలని, బోనస్ పెంచాలని, ఏజెంట్ల కమీషన్ పెంచాలని, ప్రీమియం తగ్గించాలని కోరారు.

ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి


ఫిర్యాదులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' జరిగింది. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె. ప్రకాష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దౌర్జన్యంగా ప్లాట్ల ఆక్రమణకు యత్నం


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

కడప సెవెన్‌రోడ్స్ : సీకే దిన్నె మండలం తాడిగొట్ల గ్రామ పొలంలోని శివప్రియనగర్‌లో 1997లో తాము చట్టబద్ధంగా కొనుగోలు చేసిన ప్లాట్లను కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. 1996లో గుడిపూటి చంద్రమౌళి అనే వ్యక్తి రైతుల వద్ద 34 ఎకరాల భూమిని కొనుగోలు చేసి దాన్ని 495 ప్లాట్లుగా విభజించి శివప్రియనగర్ పేరుతో విక్రయించారన్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కొందరు ఇల్లు నిర్మించుకోగా, మరికొందరు పునాదులు, ఫెన్సింగ్ వంటివి వేసుకున్నారని తెలిపారు. కాగా, కొంతమంది వ్యక్తులు ఆ భూమి తమదని, తక్షణమే ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. భూములు మీవైతే గత 21 సంవత్సరాలుగా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించగా, వారి వద్ద సమాధానం లేదన్నారు. శివప్రియ నగర్ మొత్తం వ్యవసాయ భూమిగా 2017లో దొంగ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించి తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. విచారించి న్యాయం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్‌ను కోరారు.

సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీల వేదికలో స్వల్ప మార్పులు

కడప స్పోర్ట్స్ : అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల టోర్నమెంట్‌లో భాగంగా కడప నగరంలో నిర్వహించనున్న క్రీడాపోటీలకు సంబంధించి వేదికలో స్వల్ప మార్పులు చేసినట్లు డీఎస్‌డీఓ కె. జగన్నాథ రెడ్డి తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో 19 క్రీడాంశాలకు సంబంధించిన క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కడప డీఎస్‌ఏ క్రీడామైదానంలో నవంబర్ నెలలో ఆర్మీ ఎంపికలు నిర్వహించనున్న నేపథ్యంలో మరమ్మతుల కారణంగా చిన్నమార్పులు చేసినట్లు తెలిపారు. 29వ తేదీన జరగాల్సిన బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, బెస్ట్ ఫిజిక్, రెజ్లింగ్ పోటీలను డీఎస్‌ఏ స్టేడియంలోనూ, హాకీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. అలాగే 30వ తేదీ నిర్వహించాల్సిన అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలను వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో, చెస్, లాన్‌టెన్నిస్ కబడ్డీ, క్రికెట్ యోగ, స్విమ్మింగ్ పోటీలను డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తామని వివరించారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా బాక్సింగ్ జట్లు ఎంపిక


జిల్లా బాక్సింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడకు చక్కటి ప్రాచుర్యం ఉందన్నారు. ఈ క్రీడలో బాగా రాణించి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని సూచించారు. అనంతరం అండర్-14 బాలుర విభాగం, అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, బాక్సింగ్ శిక్షకులు విజయభాస్కర్‌రెడ్డి, కె. వెంకటేష్, గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా బాక్సింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్-14 బాలురు: గంగారోహిత్, ప్రణీత్, భద్రీనాథ్, హరికృష్ణ, యగ్నేష్, పవన్, నోయల్ వర్షిత్, చరణ్‌తేజ్, షాకీర్, షోయబ్.

అండర్-17 బాలికలు : శ్యామల, అమృత, మాధవి, ప్రహషిత, మోక్షిత, హేమప్రియ, సుప్రజ, గీతిక, వెంకటసుప్రజ, వెంకటలక్ష్మి. షణ్ముఖప్రియ.

అండర్-17 బాలురు : అఫ్తాబ్, సాహిద్, లిఖత్, వెంకటమహేష్, విజయ్‌కుమార్, రామ్‌చరణ్, చరణ్, చరణ్‌తేజ్, సమీర్, తేజవర్ధన్, జాఫర్, వినయ్, వసంత్‌కుమార్.

కరెంటు షాక్‌తో భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర గాయాలు

మదనపల్లె : కరెంటు షాక్‌తో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. పాపేపల్లి పంచాయతీ గుడిసివానిచెరువుకు చెందిన బాబాఖాన్ కుమారుడు ఇమ్రాన్ (25), అదే పంచాయతీ బి.తురకపల్లికి చెందిన ఇమామ్ సాహెబ్ కుమారుడు నజీర్‌బాషా (27) భవన నిర్మాణ పనులలో భాగంగా కమ్మీ పని చేస్తూ జీవిస్తున్నారు. సోమవారం పెద్దమండ్యం సమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద నిర్మాణంలో ఉన్న భవనానికి పై కప్పు (మోల్డింగ్) వేసేందుకు కమ్మీ చుడుతుండగా ప్రమాదశాత్తు భవనంపై వెళుతున్న 32 కె.వి. విద్యుత్‌లైన్‌కు కమ్మి తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ప్రమాదంలో ఇమ్రాన్, నజీర్ బాషా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగం వైద్యులు చికిత్స అందించిన అనంతరం ఐసీయులో చికిత్స పొందుతున్నారు.

జూదరుల అరెస్టు

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో జూదమాడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక గండి రోడ్డులో జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వేంపల్లెకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశామన్నారు.

పోరుమామిళ్ల : పట్టణంలోని శీనప్ప బావి సమీపంలో పేకాట ఆడుతుండగా సోమవారం ఎస్‌ఐ కొండారెడ్డి దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 3550 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రైతుకు నష్టపరిహారం అందిస్తాం



పులివెందుల రూరల్ : పులివెందుల మండలం వెలమవారిపల్లె గ్రామ సమీపంలోని విజయవాడ - బెంగళూరు ఆరు వరుసల రహదారి పనుల్లో భాగంగా నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన చింతమాను నారాయణస్వామి రైతు పొలంలో హైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దుమ్ము, ధూళి పట్టి పంట దిగుబడి రాకుండా పోవడంతో నష్టపరిహారం అందించాలని హైవే నిర్మాణ పనులు చేస్తున్న వారిని రైతు కోరాడు. అయితే వారు నష్టపరిహారం అందించకుండా కేసు పెడతామని చెప్పడంతో సాక్షి దినపత్రికలో సెప్టెంబర్ 3వ తేదీన 'భూములిచ్చినందుకు మాపై కేసులు పెడతారా' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు వెలమవారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న రైతు నారాయణస్వామి పొలాన్ని పరిశీలించారు. దుమ్ము ధూళి కారణంగా పంట దిగుబడి రాలేదని నివేదికలు తయారుచేసి కలెక్టర్‌కు పంపించారు. రైతుకు న్యాయం జరిగే విధంగా చూస్తామని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు.

రూ 6 లక్షలు పలికిన పుష్పగిరి తలనీలాల సేకరణ వేలం పాట

వల్లూరు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు సమర్పించే తలనీలాల సేకరణ హక్కు, కొబ్బరి కాయల విక్రయ హక్కులకు కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. నవంబర్ 1 వ తేదీ నుంచి సంవత్సరం పాటు తలనీలాల సేకరణ, కొబ్బరి కాయల విక్రయ హక్కుల కోసం దేవదాయ శాఖ కడప డివిజన్ ఇన్స్‌పెక్టర్ సి. శివయ్య పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. పుష్పగిరికి చెందిన జి.బాలకేశవ రూ.6,05,000 లకు హెచ్చు పాటదారునిగా నిలిచి పాటను దక్కించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాసులు తెలిపారు. కొబ్బరికాయల విక్రయ హక్కు కోసం నిర్వహించిన వేలం పాటలో చెన్నూరుకు చెందిన కె.క్రిష్టయ్య రూ.3,50,000 లకు హెచ్చు పాటదారునిగా నిలిచి పాటను దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో డి.వెంకట సుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 32 శాతం ఐఆర్ మంజూరు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు 12వ వేతన సవరణ నివేదిక(పీఆర్‌సీ) ఆలస్యం కావడం వలన 32 శాతం ఐఆర్‌ను మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) 1938 కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తల రాజు, రాళ్లపల్లి అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కడప సీఎస్‌ఐ హైస్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు రాజు, రాష్ట్ర కౌన్సిలర్ వీరాంజులరెడ్డి, ప్రతాపరెడ్డి, చంద్రశేఖరరెడ్డి , నరసింహులు పాల్గొన్నారు.